## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: పట్టణ పరిధిలోని 19వ వార్డులో అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు గురువారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.16లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్, యూత్ టౌన్ అధ్యక్షుడు చెల్లా విక్రమ్, టీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దగ్గుల మధూకర్, నాయకులు తిప్పని రామన్న, ముక్కెర వెంకటేశ్, తిప్పని భానేష్, బాకం నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### భూ రికార్డుల వివరాలపై ఆరా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట, హాజీపూర్ గ్రామ పంచాయతీలను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీల్లోని వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. డీపీవో ఫణీందర్‌రావు, నాయబ్ తహసీల్దార్ హరిత, ఎంపీవో శ్రీనివాసరెడ్డి, మండల సర్వేయర్ మధూకర్, కార్యదర్శులు మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రంలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ రాజలింగు గురువారం పట్టుకున్నారు. రాపల్లి గోదావరి శివారు నుంచి హాజీపూర్‌కు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు.

### క్రీడా సామగ్రి పంపిణీ



కోటపల్లి: మండలంలోని జనగామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అజీమొద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎరువుల వినియోగంపై అవగాహన



చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్‌లో యాసంగిలో సాగు చేస్తున్న వరి, పత్తి పంటలలో దఫ, దఫాలుగా ఎరువులను ఎలా వినియోగించాలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

### కూరగాయల ధరలు

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాట | రూ.30 |
| పచ్చిమిర్చి | 50 |
| చిక్కుడు కాయ | 60 |
| బీరకాయ | 90 |
| వంకాయ | 60 |
| కాకరకాయ | 60 |
| బెండకాయ | 60 |
| అలసంద | 40 |
| దొండకాయ | 70 |
| సొరకాయ | 20 |
| ఆకుగోబి | 60 |
| పూగోబి | 70 |
| క్యారెట్ | 50 |
| క్యాప్సికం | 90 |
| పాలకూర | 40 |
| తోటకూర | 40 |
| ములక్కాయ | 100 |

\- మంచిర్యాలఅగ్రికల్చర్



# విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: శ్రద్ధతో చదివి విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం ఫేర్‌వెల్ డే నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పరీక్షల సమయం ఆసన్నమైందని, ఈ సమయాన్ని విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేసి జీవితంలో రాణించాలన్నారు. తల్లిదండ్రులు, విద్యాభ్యాసం చేసిన గురువులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఇంటర్మీడియెట్ అధికారిని శైలజ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు, తద్వారా సైన్స్ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి మార్కులతో పాసై మంచి భవిష్యత్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థులు చదువుకోవడం హర్షణీయమని సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్తమ మార్కులతో ప్రతి ఒక్కరూ పాస్ కావడానికి కష్టపడి చదువుకోవాలన్నారు. పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రాష్ట్రస్థాయిలో జరిగిన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ఆశీర్వదించి, ప్రశంసించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన సర్వే ఇష్టారీతిన చేపట్టారని, అనర్హులను జాబితాలో చేర్చారని బీజేపీ పట్టణ నాయకులు గురువారం మందమర్రి తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుడు తనకు సంబంధించిన వ్యక్తి పేరును డబుల్ బెడ్ రూం ఇళ్ల అర్హుల జాబితాలో చేర్చారని ఈ విషయంలో తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని ఆ వ్యక్తి పేరును జాబితా నుంచి తొలగించాలని తహసీల్దార్‌ను కోరారు. అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్ రూం దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, ఆరుముళ్ల పోషం, జంగంపల్లి మల్లయ్య, వైద్యశ్రీనివాస్, బంగారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ అందజేత

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామంలో గల జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు గురువారం మంచిర్యాల కస్తూరి ఫౌండేషన్ నిర్వాహకులు కస్తూరి పద్మచరణ్, ఎంఈవో జాడి పోచయ్య చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ తోచిన సాయం చేస్తుందన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థులు పది జీపీఏ సాధిస్తే వారికి రూ.10వేల నగదు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నటు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం ఉన్నారు.

# 'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోండి



కంటివెలుగు సిబ్బందిని సన్మానిస్తున్న కౌన్సిలర్ కొండ పద్మ

బెల్లంపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు వైద్య శిబిరాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని కన్నాల గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కళ్లల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం రెండో విడత కంటివెలుగును ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని, ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, సర్పంచ్ స్వరూప, ఎంపీడీవో రాజేందర్, పీహెచ్‌సీ వైద్యుడు అనీష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేటలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం శిబిరాన్ని పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి పరిశీలించారు. శిబిరాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ ముత్యాల మౌనిక, సంపత్, ఉప సర్పంచ్ దుర్గం మధుకర్, కార్యదర్శి దివ్య ఉన్నారు.

**కంటి వెలుగు సిబ్బందికి సన్మానం**

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 21వ వార్డులో కంటివెలుగు శిబిరాన్ని నిర్వహించిన వైద్య సిబ్బందితో పాటు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బందిని గురువారం వార్డు కౌన్సిలర్ కొండ పద్మ ఘనంగా సన్మానించారు. వార్డులోని ప్రజలందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి రీడింగ్ గ్లాసెస్‌ను ఇవ్వగా, ప్రిస్క్రిప్షన్ అద్దాలున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తెలిపి, వారికి కానుకలు అందజేశారు. కార్యక్రమంలో కొండ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్



కాజిపల్లిలో ప్రారంభిస్తున్న వైద్యులు శ్వేత, సర్పంచ్

భీమారం: కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ శ్వేత ప్రజలను కోరారు. మండలంలోని కాజిపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ తిరుపతితో కలిసి డాక్టర్ శ్వేత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సతీష్‌రెడ్డితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'సమాజంలో మహిళల పాత్ర కీలకం'



మహిళలకు పురస్కారం అందజేస్తున్న భాగ్యలక్ష్మి



విజేతలకు బహుమతులు ఇస్తున్న మమత సభ్యులు

మందమర్రిరూరల్: మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి తెలిపారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో దుర్గం పోశం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరై పలు రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించి నారీ శక్తి పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో చెన్నూ ర్ మాజీ ఎమ్మెల్యే ఓదేలు, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దుర్గం రాజేష్, సునార్కర్ రాంబాబు, పాఠశాల ప్రిన్సిపల్ నవీన్‌కుమార్, డ్యాన్స్ మాస్టర్ గోపి, అనీల్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

**'మమత' ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం**

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మహిళా తరంగిణి ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం విశ్వనాథ ఆలయంలోని హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు ఆటల పోటీలు, ఫ్యాషన్ షో, వంటల పోటీ, డ్యాన్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అత్తి సరోజ హాజరుకాగా, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి కట్ల భాగ్యలక్ష్మి, ముడుపు అరుణను మమత సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మమత గౌరవ అధ్యక్షురాలు జి.ఇందిరాదేవి, అధ్యక్షురాలు జి.శ్రీదేవి గౌడ్, ఉపాధ్యక్షులు ఆర్.మంజుల, కె.చంద్రకళ, కార్యదర్శి కె.పద్మ, సంయుక్త కార్యదర్శి వీరమణి, కోశాధికారి జ్యోత్స్న చంద్రదత్, సలహాదారులు జి.భాగ్యలక్ష్మి, కె.చిదానంద కుమారి, సభ్యులు పాల్గొన్నారు.

## 'ఉపాధి'పై సమీక్ష సమావేశం

కాసిపేట: ప్రతి గ్రామపంచాయతీలో 50మంది ఉపాధి కూలీలను తప్పకుండా నమోదు చేయాలని ఎంపీడీవో ఎం.ఏ.ఆలీం సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బృహత్ ప్రకృతివనాలను పూర్తి చేసి నిర్వహణ చేపట్టాలన్నారు. చెత్త తరలించేందుకు ట్రాక్టర్లు వినియోగించడంతో పాటు తడి,పొడి చెత్త రోజువారీగా సేకరించి వేరు చేయాలన్నారు. డంపింగ్ యార్డు వద్దనే చెత్తను డంప్ చేయాలని, నర్సరీల్లో మొక్కలను కాపాడుకునేందుకు షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేయడంతో పాటు క్రమం తప్పకుండా నీటిని అందించాలని, మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఎంపీవో నాగరాజు, ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.



## 'మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి'

నస్పూర్: నేటి సమాజంలో మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సతీమణి బదావత్ పల్లవి సంతోష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఓ మాక్స్ కాలనీలోని సిటీ విల్లాస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదావత్ పల్లవిసంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు స్వాతంత్ర్య సమరయోధురాలు సువ్వాబాయి, బదావత్ పల్లవి సంతోష్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.



బదావత్ పల్లవిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

## ఉత్సాహంగా క్రీడాపోటీలు

బెల్లంపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పురప్రజలు, మహిళా ప్రజాప్రతినిధులు హాజరై ఉత్సాహంగా ఆడారు. పోటాపోటీగా సాగిన క్రీడాపోటీల్లో పలువురు మహిళలు ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, పలువురు కౌన్సిలర్లు, మహిళ సమాఖ్య అధ్యక్షులు, మున్సిపల్ కార్యాలయం, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు నిర్మించరూ..!

అటెన్షన్ ప్లీజ్..



పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. డ్రెయినేజీ లేక మురుగునీరు రోడ్లపై పారుతున్నాయని వాపోయారు. కాలనీ ఏర్పాటై 6సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నామని ఆరోపించారు.

సంప్రదించాల్సిన అధికారి : రాజు, మున్సిపల్ కమిషనర్ ఫోన్ నంబర్ : 9849905886

## సాక్షి సినిమాలు




| | |
|---|---|
| **మంచిర్యాల** | |
| శ్రీనివాస | సార్ |
| వెంకటేశ్వర | ఆర్‌ఆర్‌ఆర్ |
| జెమిని సినిమా స్క్రీన్ 1 | బలగం/తూ జూతి మై మక్కర్ |
| జెమిని సినిమా స్క్రీన్ 2 | జంతు ప్రపంచం/సార్ |
| **లక్సెట్టిపేట** | |
| మహానంద | ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు |
| **జన్నారం** | |
| రాఘవేంద్ర | ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు |
| **చెన్నూర్** | |
| శ్రీశ్రీనివాస | బలగం |
| **బెల్లంపల్లి** | |
| రామకృష్ణ | ఆర్‌ఆర్‌ఆర్ |
| బాలాజీ | సార్ |
| **సీసీసీ** | |
| దేవి | జంతు ప్రపంచం |
| తిరుమల | సార్ |

\- మంచిర్యాలటౌన్

### 'భారత్ బచావో' సెమినార్‌కు తరలిన నాయకులు

పాతమంచిర్యాల: ఈ నెల 11, 12తేదీల్లో బీజేపీ మినహా అన్ని పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే భారత్ బచావో సెమినార్‌కు జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రజాసంఘాల నాయకులు పలిగిరి కనకరాజు, దేవిపోచన్న, వడ్డెపల్లి మనోహర్, కనుకుట్ల మల్లయ్య, ఇబ్రహీం, వెంకటేష్‌తో పాటు పలువురు నాయకులు తరలివెళ్లారు.

## సమాచారం

### విద్యార్థులకు ఉచిత కౌన్సెలింగ్

జన్నారం: చిన్న విషయాలకే మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడటం, పరీక్షల్లో ఫెయిల్ అవుతామోనని ఆందోళనలకు గురవుతున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రముఖ సైకాలజిస్టు ప్రకాశ్‌నాయక్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఉచితంగా కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు గురువారం ప్రకటించారు. గంజాయి, డ్రగ్స్, మద్యానికి అలవాటుపడి బానిసలవుతున్న విద్యార్థులు, చిన్న సమస్యలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారు పెరుగుతున్నందునా, తన వంతుగా సహాయమందించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు ఫోన్‌ద్వారా గానీ, నేరుగా గానీ సంప్రదించవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు సెల్:9398617711 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### నేడు కాసిపేటలో రక్తదాన శిబిరం

కాసిపేట: మండల రెవెన్యూ శాఖ తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాల్సిందిగా తహసీల్దార్ దిలీప్‌కుమార్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు, మీ సేవా నిర్వహకులు, రాజకీయ నాయకులు, కుల సంఘాలు, పంచాయతీ కార్యదర్శులు పలు శాఖల సిబ్బందితో రక్తదాన శిబిరం నిర్వాహణ సమావేశం నిర్వహించారు. ఉదయం 9గంటలకు సోమగూడం రహదారి పక్కన గల కలర్ మినిస్ట్రీస్ చర్చి ప్రాంగణంలో తలసేమియా వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక రోగులకు, గర్భిణులకు రక్తం అవసరాన్ని గుర్తించి రక్తం నిల్వలు తక్కువగా ఉండటంతో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక దృక్పథంతో అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి రక్తదానంలో పాల్గొనాల్సిందిగా కోరారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వారసంత ప్రారంభం

వేమనపల్లి: ఎట్టకేలకు మండల కేంద్రంలో గురువారం వారసంత ప్రారంభమైంది. సర్పంచ్ కుబిడె మధు వారసంత ఏర్పాటు చేసే స్థలంలో పారిశుధ్య కార్మికులతో చదును చేయించారు. వారసంత ఏర్పాటుతో మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు దహెగాం, కన్నెపల్లి, మహారాష్ట్ర గ్రామాల ప్రజలకు తక్కువ ధరలకు సరుకులు లభించనున్నాయి. చిరు వ్యాపారులు సైతం సంతకు కూరగాయలు, పప్పుదినుసులు, సరుకులు తీసుకొచ్చి అమ్ముకున్నారు.

## నిలిచిన పనులు.. ప్రజల ఇబ్బందులు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గఢ్‌పూర్‌కు వెళ్లే రహదారిపై రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. గిరిజన గ్రామాలైన గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు నిత్యం ఈ రోడ్డు మీదుగా ప్రయాణాలు సాగిస్తుండగా, దాదాపు కిలో మీటర్ మేర బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా ఉండడంతో నానా అవస్థలు పడుతున్నారు. బీటీ రోడ్డు రెన్యూవల్‌కు 20లక్షల నిధులు మంజూరు కాగా, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ బీటీ రెన్యూవల్‌పై అటవీశాఖ అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తుండడంతో అటవీ శాఖ ఆ పనులను అడ్డుకుంది. దీంతో దాదాపు నెల రోజులుగా రోడ్డు పనులు నిలిచిపోవడంతో, పూర్తి కంకర రాళ్లపై రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.